శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మేడిపల్లి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో క్రిమినల్, సివిల్ వివాదాల్లో వెళ్లొద్దని సూచించారు. మళ్లీ ఇలాంటి నేరాల్లో పాలుపంచుకుంటే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టును సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యాబోధనలో పలుమార్పులు వస్తాయి

మల్కాజిగిరి: రాబోయే విద్యా సంవత్సరంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని బోధన తరగతులు నిర్వహించాలని మల్కాజిగిరి, అల్వాల్ మండల విద్యాధికారులు సురేష్, మురళీకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. మల్కాజిగిరి బాలుర పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే విద్యాసంవత్సరంలో విద్యాబోధనలో పలు మార్పులు వస్తాయన్నారు. వాటికి అనుగుణంగా బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా బేసిక్ రీడింగ్, రైటింగ్, బేసింగ్ మ్యాథ్స్‌పై చర్చించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ గురించి ఉపాధ్యాయులతో చర్చించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

బోడుప్పల్‌లో 'రాజీవ్ యువ వికాసం' పథకం ప్రారంభం

బోడుప్పల్: ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ, నిరుద్యోగ యువకులకు ఆర్థికసాయం నిమిత్తం తెలంగాణ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ×రాజీవ్ యువ వికాసం¥ పథకాన్ని బోడుప్పల్‌లో గురువారం కమిషనర్ శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారందరూ ఆన్‌లైన్ ద్వారా మీసేవ, నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వృత్తుల వివరాలు మున్సిపల్ సిటిజన్ సర్వీస్‌సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తు ప్రతులను స్వీకరిస్తామని, పూర్తి సమాచారం కోసం పౌర సేవా కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసక్తిగల నిరద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 14 వరకు ఉందన్నారు. గురువారం దరఖాస్తులను అడిషినల్ మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్ రావు, మేనేజర్ ప్రవీణ్‌కుమార్ స్వీకరించారు.


నాచారం రాఘవేంద్రనగర్‌లో భారీగా చేరిన వరద నీరు


నాచారం ఫైర్‌స్టేషన్ వద్ద చేరిన వరద నీరు


రామంతాపూర్‌లో జలమయమైన లోతట్టు ప్రాంతాలు


మిర్జాలగూడ చిన్మయిమార్గ్‌లో జలమయమైన రోడ్డు

వర్ష బీభత్సం.. జనజీవనం అస్తవ్యస్తం

ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు

- విరిగి పడిన చెట్ల కొమ్మలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈదురు గాలులకు చెట్లు, పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు విషయం చెప్పనవసరం లేదు. చాలా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తీవ్ర ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు నరకం అనుభవించారు.


రామంతాపూర్ శ్రీనివాసపురం రామ్ శంకర్‌నగర్‌లలో రోడ్లపై వరద నీరు


లోతట్టు ప్రాంతాలల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్,

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు రోడ్లపై నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అల్వాల్ ప్రధాన రహదారిలో ఇయాన్ డిజిటల్ వద్ద ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీరు రోడ్డుపై భారీస్థాయిలో నిలిచిపోవడంతో రోడ్డుకి ఇరువైపులా ఉన్న షాపుల్లోకి చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నాగరాజులు తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రెండు కోట్ల రూపాయల మేర ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిసింది. త్వరలో కల్వర్టు విస్తరణ పనులు చేపడుతారని అధికారులు తెలిపారు. అల్వాల్ డివిజన్‌లోని నాగిరెడ్డి కాలనీ, వెంకటాపురం, కృష్ణమ్మ కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. వెంకటాపురం డివిజన్ శివానగర్ ఆర్బీఐ కాలనీలో నాళాలు ఉప్పొంగాయి. కానాజీగూడ ప్రధాన రహదారిలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనుల వల్ల వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం..

మల్లాపూర్: అనూహ్యంగా కురిసిన భారీ వర్షానికి మల్లాపూర్, నాచారంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మల్లాపూర్ భవానీనగర్, న్యూభవానీనగర్, గ్రీన్‌హీల్స్‌కాలనీ, నాచారం మెయిన్ రోడ్, రాఘవేంద్రనగర్ జాన్సన్ గ్రామర్ స్కూల్ రోడ్డు పూర్తిగా జలమయం అయ్యింది. నాచారం ఫైర్‌స్టేషన్ వద్ద రోడ్డుపై భారీగా నీరు చేరడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. లోతట్టు ప్రాంతాలల్లో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పర్యటించి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు.

రామంతాపూర్ డివిజన్ పరిధిలో...

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలతో పాటు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది. ముఖ్యంగా సత్యదేవుని ఆలయం ఇందిరానగర్, నేతాజీనగర్, శ్రీనగర్‌కాలనీ, కేసీఆర్‌నగర్, వెంకటరెడ్డినగర్, రామ్‌రెడ్డినగర్, వివేక్‌నగర్, శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లపై వర్షపునీరు ఏరులై పారింది. పనుల కోసం బయటకి వెళ్లిన వారు ఇంటికి చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గౌతంనగర్ డివిజన్ పరిధిలో...

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. మిర్జాలగూడ చిన్మయి మార్గ్, రాజానగర్, రాజశ్రీనివాస్‌నగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో రోడ్డుపై మోకాలి లోతు నీరు చేరి తీవ్ర ఇబ్బంది పడ్డామని స్థానికులు తెలిపారు. ఈ సమస్య దశాబ్ద కాలంగా ఉందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఓల్డ్ అల్వాల్ బాటా షోరూమ్ వద్ద భారీ వర్షంతో నిండిపోయి పక్కన షాపులోకి వెళ్లాయి. దీంతో పలు షాపు నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువు కట్ట మీద దాదాపుగా అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. బోడుప్పల్ నుంచి ఉప్పల్ వైపు వస్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. అరగంట వరకు అంబులెన్స్ సైరన్ కొడుతూ ఉండిపోయింది. అక్కడే ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి క్లియర్ చేసారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా..

మల్కాజిగిరి: మల్కాజిగిరి, ఈస్ట్‌ఆనంద్‌బాగ్ డివిజన్లలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కాలనీల్లో వీధులు జలమయమయ్యాయి. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలాలు వర్షంనీరుతో పొంగి పారాయి.


ఓల్డ్ అల్వాల్ బాటా షోరూమ్ ఎదురుగా వర్షంతో జలమయమైన రోడ్డు


ఆనంద్‌బాగ్‌లో రోడ్డు పై నిలిచిన వర్షం నీరు


మల్కాజిగిరిలో జోరు వర్షం


మచ్చబొల్లారం అంజనాపురి కాలనీలో నిలిచిన వర్షపు నీరు



విలేకరిని దూషించిన వ్యక్తిపై కేసు

ఉప్పల్: ఓ దినపత్రిక విలేకరిని దూషించిన వ్యక్తిపై బుధవారం ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ విలేకరి జీహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన ఆర్టీఐ కాపీని తీసుకెళ్లేందుకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు మేకల మధుసూదన్ రెడ్డి వచ్చి ఆర్టీఐ ఎందుకు అడుగుతున్నావ్ అంటూ దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు విలేకరి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీ

మేడిపల్లి: ఇంటిముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామానికి చెందిన మెరుగు రమేష్‌గౌడ్ బుధవారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని తమ ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. వెంటనే బాధితుడు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భారతి అల్ట్రాఫాస్ట్ మెరుగైన సిమెంట్

బోడుప్పల్: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ మెరుగైందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి అన్నారు. బోడుప్పల్‌లో అంజనపురి కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి ఏజెన్సీలో సాయంత్రం తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ మెరుగైనదని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో రారాజుగా భారతి సిమెంట్‌ను వాడాలని కోరారు. ఈకార్యక్రమంలో డీలర్ రవి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.


తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ ఇంజినీర్ బద్రి

వృద్ధురాలి అదృశ్యం


బొల్లి బాలవ్వ (ఫైల్)

మల్లాపూర్: ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం ఎర్రకుంటకు చెందిన బొల్లి బాలవ్వ (65) ఈనెల 1వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలవ్వకు మానసిక స్థితి సరిగా లేదని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి


ఉప్పల్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు


మల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

ఉప్పల్: ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఉప్పల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొరిగే కృష్ణ, కురుమ సంఘం అధ్యక్షుడు చిందం వెంకటేశ్, న్యాయవాది గొరిగే మల్లేష్, వెలుగు గుట్ట ఆలయ చైర్మన్ జన్నీ రఘు, కృష్ణయ్య, కొండ్రు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆయన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

మల్లాపూర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మల్లాపూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేటర్లు ప్రభుదాస్, సాయిజెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571